## క్లుప్తంగా

### నేడు భీష్మ ఏకాదశి

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథంలు ప్రకటించారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వామి వారికి మన్యుసూక్త సింధూర అభిషేకాలు, 6 గంటలకు శ్రీ భవాని శంకర ఆలయంలో రుద్రాభిషేకం, సాయంత్రం 6గంటలకు సామూహిక విష్ణు సహస్రనామపారాయణం అనంతరం నివేదన, ప్రసాద వితరణ, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### కాశీ మహాక్షేత్రంలో రామాయణ మహాయజ్ఞం

చిక్కడపల్లి: పవిత్ర గంగానదీ తీరంలోని వారణాసి కాశీ విశ్వనాథ మహాక్షేత్రంలో ఫిబ్రవరి 3 నుంచి 11 వరకు లోకకల్యాణార్థం శ్రీ ప్రణవనాథ మహా రుద్ర రామ తారక రామాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు సుందరదాసు ఎం.ఎస్.రామారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, అభినవ సుందరదాసు డాక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని మెమోరియల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాక్రతువులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది హాజరవుతున్నారని తెలిపారు.

### నవోదయ పరీక్షపై ఉచిత అవగాహన

చిక్కడపల్లి: నవోదయ విద్యాలయ పోటీపరీక్ష రాసే విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షల్లో వచ్చే వివిధ అంశాలపై అనుమానాలను నివృత్తి చేసేందుకు చిక్కడపల్లి బీఆర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఈనెల 5న ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటుందని సంస్థ డైరెక్టర్ సుదర్శన్ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### బీజేపీకి డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజీనామా

అంబర్‌పేట: బీజేపీ పార్టీకి బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో షాక్ తగిలింది. డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి జమ్మిచెట్టు బాలరాజు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. తాను నివసిస్తున్న బతుకమ్మకుంట, సాయినగర్ అభివృద్ధి కోసమే రాజీనామా చేశానన్నారు. గత 8 ఏళ్లుగా బస్తీకి కమ్యూనిటీ హాల్ లేదని, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. త్వరలో తాను ఏ పార్టీలో చేరబోయేదనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తానన్నారు.

### గోపాలమిత్ర నూతన కమిటీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోపాలమిత్ర నూతన కమిటీని మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బందయ్య, గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా బి.కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, సురేష్, కోశాధికారిగా శివకుమార్, సహ కార్యదర్శిగా ముజీబ్, ముత్తయ్య తదితరులు ఎన్నికయ్యారు. టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్రెలకు ఇంజక్షన్‌లు ఇస్తూ వాటిని పరిరక్షిస్తామన్నారు. కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

### హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

లాలాపేట: జూనియర్ కళాశాల్లో పీడీ పోస్టుల నియామకాల్లో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. ఏ. బాలరాజ్, ప్రధాన కార్యదర్శి డా. బి. లక్ష్మయ్య ఓ పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిజికల్ డైరెక్టర్ల పోస్టుల నియామకాల్లో డబుల్ పీజీ విద్యార్హత కారణంగా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఫిజికల్ డైరెక్టర్ల పోస్టుకు కేవలం మాస్టర్ డిగ్రీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్హత ఉండగా తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమీషన్ ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ పీజీ అదనపు డిగ్రీ ఉండాలనీ నిబంధనలు విధించడం పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

### ట్రాలీ వ్యాన్ బీభత్సం

సికింద్రాబాద్: ఓ బాలుడి దుందుడుకు చర్య ఫలితంగా ట్రాలీ వ్యాన్ బీభత్సం సృష్టించింది. ముషీరాబాద్‌కు చెందిన అమీర్ తన టాటా ఏస్ ట్రాలీ వ్యాన్ వాహనాన్ని సీతాఫల్‌మండి రామాలయం వద్ద నిలిపి పక్కకు వెళ్లాడు. అదే సమయంలో అమీర్ వెంట వచ్చిన ఓ 15 ఏళ్ల బాలుడు సదరు వాహనాన్ని స్టార్ట్ చేసి ముందుకు కదిలించే ప్రయత్నం చేశాడు. అదుపు తప్పిన వ్యాన్ ఒక్కసారిగా ముందుకు కదిలి అక్కడే ఆపిన పలు ద్విచక్ర వాహనాలను ఢీకొడుతూ ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలు ద్విచక్రవాహనాలు ధ్వంసం అయ్యాయి. పాదచారులు అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం తప్పింది.

# డ్రైన్ నాలాల నిర్లక్ష్యం



శివంరోడ్డులోని జలమండలి పంప్ హౌజ్ వద్ద ఇలా..

గ్రేటర్ మహానగరంలో ఫుట్‌పాత్‌లు, నాలాల నిర్మాణం కోసం రాష్ట్రప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి ఏటా కోట్లాది రూపాయలు కేటాయిస్తోంది. సరైన ప్రణాళిక లేకుండానే అధికారులు ఆ నిధులతో ఆయా ప్రాంతాల్లో లక్షల రూపాయల వ్యయంతో నాలాలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- వ్యర్థాలతో నిండిపోయిన ఫైనం

నల్లకుంట: ఫుట్‌పాత్‌లు, డ్రైన్ నాలాల నిర్మాణ సమయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు, వర్షపు నీటి నాలాలపై నిర్మించిన స్లాబ్‌లు అస్తవ్యస్తంగా మారి ప్రాణ సంకటంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నల్లకుంట శివం రోడ్డులో చే నంబర్ చౌరస్తా వరకు వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు బాక్స్ నాలాను నిర్మించారు.
- నాలా నిర్మాణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల నాలాపై స్లాబ్‌లను నిర్మించకుండా అలాగే వదిలేశారని స్థానికులు వాపోతున్నారు.
- శివంరోడ్డులోని జలమండలి పంప్‌హౌజ్ ఖాళీ స్థలం పక్కన నిర్మించిన బాక్స్ నాలాపై అసంపూర్తిగా స్లాబ్ వేశారు.
- స్లాబ్‌లేని చోట నాలాలో ఇళ్లల్లో పనిచేసే కొందరు వ్యర్థాలను తీసుకొచ్చి నాలాలోనే పారవేసి వెళ్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- పేరుకుపోతున్న వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో నాలా పూర్తిగా వ్యర్థాలతో నిండిపోతుంది.
- ఏటా వర్షాకాలంలో వర్షపునీరు సజావుగా వెళ్లేందుకు దారిలేక మురుగుతో పాటు వరదనీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది.
- స్లాబ్ నిర్మాణం చేపట్టని చోట నాలా ప్రమాదకరంగా ఉండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఇంట్లో పాడైపోయిన ప్లైవుడ్ సామగ్రిని తీసుకొచ్చి నాలాలోనే పారవేయడంతో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి, నాలాపై స్లాబ్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదకరంగా రహదారి..



నల్లకుంట ప్రభుత్వ పాఠశాల వద్ద ..

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ నల్లకుంట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రోడ్డు ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి రంధ్రం కాస్తా భారీగా ఏర్పడితే వాహనదారులు, పాఠశాల విద్యార్థులకు భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం 78 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 25 మందికి షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కార్పొరేటర్లు కె.రవిచారి, గౌసుద్దీన్‌లతో కలిసి అందజేశారు. పేద దళితులకు రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేస్తూ వారు ఆర్థికంగా బలపడేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. రూ. 4.37 కోట్లతో చేపట్టిన ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించామన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహా, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు మోజెస్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, వల్లాల శ్యామ్ యాదవ్, సీనియర్ నాయకులు సుందర్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్‌గౌడ్, రవియాదవ్, మహ్మద్ ఖదీర్ తదితరులున్నారు.

**పింఛన్ కార్డుల పంపిణీపై అభ్యంతరం..**

- లబ్ధిదారులకు ఇటీవల మంజూరైన ఫించన్ కార్డులను బీఆర్ఎస్ నేతలు ఏ అర్హతతో పంపిణీ చేస్తున్నారని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి ప్రశ్నించారు. ముషీరాబాద్ మండల అధికారులు బీఆర్ఎస్ నేతలకు తొత్తులుగా మారారని మండిపడ్డారు. కొంత మంది బీఆర్ఎస్ నేతలు మంజూరైన ఫించన్ కార్డులను వారి వద్దనే పెట్టుకుని లబ్ధిదారులకు కార్డులు అందజేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.
- లబ్ధిదారులు, వృద్ధులు ఎమ్మెల్యే కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ.. కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని తమ కార్డు ఎక్కడ ఉందో తెలియక ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.

# ఆత్మీయ సమ్మేళనం

అంబర్‌పేట: బడుగు బలహీనవర్గాల ప్రజలు వచ్చిన అవకాశాలను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీసీలంతా నియోజకవర్గంలో ఏకమై బీసీ బిడ్డనైన తనను గత ఎన్నికల్లో గెలిపించారని వచ్చే ఎన్నికల్లో సైతం అండగా నిలవాలని ఆయన కోరారు. మంగళవారం 6వ నెంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నాయిబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాయిబ్రాహ్మణులు అంటే నమ్మకస్తులు అని, వారి అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

- సీఎం కేసీఆర్ నాయిబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని ఇది దేశంలో ఎక్కడా లేదన్నారు.
- నియోజకవర్గంలో నాయిబ్రాహ్మణుల కోసం తాను వ్యక్తిగతంగా కమ్యూనిటీ హాల్ కోసం 100 గజాల స్థలం ఇచ్చానని తానే కమ్యూనిటీహాల్‌ను నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు.
- ప్రతి సెలూన్‌లో తాను అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నాయిబ్రాహ్మణుల కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు నరేందర్, లింగం, సురేష్, శేఖర్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

### వైభవంగా శ్యామలదేవీ పల్లకి ఊరేగింపు



ముషీరాబాద్: ముషీరాబాద్‌లో శ్రీశక్తి పీఠం గ్రేటర్ హైదరాబాద్ ట్రస్టీ చైర్మన్ శక్తినందస్వామి ఆధ్వర్యంలో శ్యామలదేవీ పల్లకి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం భక్తులు అడుగడుగునా అమ్మవారికి స్వాగతం పలుకుతూ పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు టి.సోమన్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు. శక్తినందస్వామి మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు శ్యామలదేవీ నవరాత్రి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించామన్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తూ రోజూ అర్చనలు, సహస్ర నామాలు, పారాయణం, అన్నదానం నిర్వహించమన్నారు. శ్రీశక్తిపీఠం గౌరవ అధ్యక్షులు సుగుణానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

### 'హిందూ వ్యతిరేక కుట్రను వ్యతిరేకించాలి'

కాచిగూడ: భారతదేశ 'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్' 'రా' పాకిస్తాన్‌కు చెందిన 'ఐఎస్ఐ' సహాయాన్ని తీసుకోవడం మనం ఎరుగమని అది సాధ్యం కాని విషయమని రిటైర్డ్ మేజర్ సరస్ త్రిపాఠి అన్నారు. హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో మంగళవారం 'పఠాన్–బాలివుడ్‌కు పాకిస్తాన్ పై ప్రేమేనా?' అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. హిందూ పండితులను, సంతులను, హిందూ పాత్రలను ఎన్నో ఏళ్లుగా బాలీవుడ్ చెడ్డవాళ్లుగా చిత్రీకరిస్తోందని ఇది ఓ కంపెనీ ఆజ్ఞలతో బాలీవుడ్ చేస్తున్న కుట్రలో భాగమని ఆరోపించారు. హిందూ జన జాగృతి సమితి తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి చేతన్ గాడి, రమేష్ షిండే తదితరులున్నారు.

# అదనపు విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



వీఎస్‌టీ చౌరస్తాలో డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపే అదనపు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వీఎస్‌టీ చౌరస్తాలోని డీఈ కార్యాలయం వద్ద సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ పేరుతో వేస్తున్న అదనపు భారాన్ని ప్రభుత్వం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి కూరుపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజాపంథా నగర కార్యదర్శి హన్మేష్, సీఐటీయూ నగర అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, స్వరూప, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్, నాయకులు అనిల్, రవికుమార్, కృష్ణ తదితరులున్నారు.

# మహిళా సాధికారతతో సమస్యల పరిష్కారం



బీజేపీ మహిళా మోర్చా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: మహిళా సాధికారతతోనే వారి సమస్యలు పరిష్కారమవుతాయని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో మహిళా మోర్చా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు శక్తివంతులైనప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని తెలిపారు. మహిళలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యుదయానికి పెద్దపీట వేస్తోందని మహిళలు స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకుని లబ్ధిపొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, మహాలక్ష్మి, రామన్‌గౌడ్ సుప్రియాగౌడ్ జ్యోతి, నీరజా, కళావతి, రమ్య, మాధవి, రాజశేఖర్‌రెడ్డి, కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

# పాత పద్ధతిలోనే పరీక్షా పత్రాల వాల్యూయేషన్

ముషీరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్లను ఈ విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ వాల్యూయేషన్ చేయాలని మంత్రి చేసిన ఆదేశాలను ఉపసంహరించుకుని పాత పద్ధతిలోనే వాల్యూయేషన్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పరశురామ్, ప్రధాన కార్యదర్శి విజయ్‌ఖన్నాలు డిమాండ్ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్‌మిట్టల్ ఆన్‌లైన్‌లో పరీక్షా పేపర్లను వాల్యూయేషన్ చేయడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

- ఆన్‌లైన్ పేపర్ వాల్యూయేషన్‌తో 35 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. పనిభారం తప్పించుకునే పేరుతో ఆర్థిక భారాన్ని విద్యార్థులపై మోపే విధానం సరికాదన్నారు.
- విద్యార్థుల గోప్యతకు సంబంధించిన అన్ని వివరాలు ఏజెన్సీకి అప్పజెప్పడం తప్పని కరోనా పరిస్థితుల్లో అనివార్య కారణాల వల్ల కొన్ని యూనివర్సిటీల్లో ఈ విధానం కొనసాగిందన్నారు.
- ఓ పేపర్ వాల్యూయేషన్ స్కూటీ్ని, గ్రేడింగ్‌కు సుమారు రూ.30 పడుతుందని ఈ భారాన్ని విద్యార్థులపై రుద్ది బలవంతంగా పరీక్ష ఫీజుల పేరుతో వసూలు చేస్తున్నారని విమర్శించారు.
- గతంలో అనుభవం లేని గ్లోబరీనాకు పరీక్షా నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తే అనేక తప్పులు జరిగి చాలా మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైందన్నారు.
- ప్రస్తుతం గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పలువురితో సంప్రదింపులు జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# చట్టాల అమలుకు మరో పోరాటం



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక అధ్యక్షులు ఎస్.జీవన్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సాధించుకున్న హక్కుల అమలుకు మరో పోరాటం చేయాల్సిన దుస్థితి వస్తోందని మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు జీవన్‌కుమార్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేషనల్ అలియన్స్ ఫర్ సోషల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు.

- మహిళలకు ప్రసూతి ప్రయోజనం, వేతన నష్టపరిహారంగా ఆరు నెలల కనీస వేతనం ఇవ్వాలని నెలసరి పెన్షన్ వేతనంలో 50 శాతంగా ఉండాలన్నారు.
- అసంఘటిత రంగంలోని కార్మికులకు ఈఎస్ఐతో లింక్ చేయాలని, అంగవైకల్యం లేదా మరణిస్తే కనీసం రూ. 5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ఏఎఫ్ఎస్ఎస్ జాతీయ కన్వీనర్ చెన్నయ్య, రీజనల్ సెక్రటరీ సుదర్శన్‌రావు, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటయ్య తదితరులున్నారు.

### త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



త్యాగరాజ ఆరాధన ఉత్సవాల్లో ఆలాపన చేస్తున్న కళాకారులు

ముషీరాబాద్: హిమాయత్‌నగర్‌లోని వాసవీ సంగీత నృత్య కళాశాలలో సద్గురు త్యాగరాజ ఆరాధన ఉత్సవాల్లో కళాకారులు పాల్గొని అలరించారు. త్యాగరాజు దివ్య నామసంకీర్తనలతో కూచిపూడి, భరతనాట్యం, నృత్య ప్రదర్శన చేసిన కళాశాల విద్యార్థులు ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా వాసవీ అకాడమీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ టీ.వీ.సుబ్బారావు పాల్గొని కళాకారులను సత్కరించారు. శాస్త్రీయ కళలను కాపాడుకోవాలని లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని మన్నించవన్నారు. దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేవి కళలే అని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నారదామృతం పురస్కారం ప్రదానం



చిక్కడపల్లి: ఉదయ్‌సుందర్ కొలపల్లికి సంచలనా డాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో నారదామృతం పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన బాలోత్సవ్ కార్యక్రమంలో నిర్వాహకురాలు పద్మాకల్యాణ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో నారదబ్రహ్మ పేరు మీద ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఉదయ్‌సుందర్ అమెరికాలో ఉంటూ పుట్టిన నేలపై మమకారంతో దాదాపు రూ.90 లక్షలు ఇచ్చి తన దాతృత్వాన్ని చాటారన్నారు. లిటిల్ థెరిసా స్కూల్ కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా కార్యదర్శి శ్రీనివాసచక్రవర్తి, బాలోత్సవ్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, సంచలన స్కూల్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



వివరాలు తెలుసుకుంటున్న మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి పేర్కొన్నారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు అమలు చేసే స్థాయికి సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందని వివరించారు. అన్ని వయసుల వారికి కంటి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, మోతే శోభన్‌రెడ్డి, అనసూయమ్మ, విజయ, మణెమ్మ పాల్గొన్నారు.

### ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీలోని అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... వివిధ కంప్యూటర్ కోర్సులలో ఇచ్చే ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్‌ను కార్పొరేటర్ అభినందించారు. నాయకులు శ్రవణ్‌గౌడ్, సాయి తేజేశ్వర్‌రెడ్డి, గిరీష్‌గౌడ్ శివ, టింకు, శశాంక్ పాల్గొన్నారు.

### అభినందనలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగం అధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొ.మాధవికి పలువురు విద్యార్థులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. గతంలో నిజాం కాలేజీ హెడ్, ఎగ్జామినేషన్ తొలి మహిళా కంట్రోలర్‌గా పని చేసిన ప్రొ.మాధవి ఓయూ జంతుశాస్త్రం విభాగానికి హెడ్ కావడం ఆనందంగా ఉందని ఓయూ జేఏసీ రాష్ట్ర నాయకులు వేల్పుకొండ రామకృష్ణ, రీసర్చ్ స్కాలర్ వెంకట్ పేర్కొన్నారు.

### ప్రతిభాశాలి పుస్తకావిష్కరణ



డా. కేవీ.రమణాచారి, ఆచార్య ఇనాక్ తదితరులు

చిక్కడపల్లి: రాయలసీమ వైతాళికుడు పప్పూరి రామాచార్యులు జీవితచరిత్ర ఆధారంగా రావినూతల శ్రీరాములు రచించిన ప్రతిభాశాలి పుస్తకావిష్కరణ సభ త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళా వేదికలో జరిగింది. మంగళవారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డా. కేవీ. రమణాచారి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థ జాతీయ ఉద్యమకారుడు, స్వాతంత్ర సమరయోధులు పప్పూరి రామాచార్యుల వంటి మహానుబావుల గురించి ఈ తరానికి తెలియాల్సి ఉందన్నారు. తాను కడప కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో కూడా రామాచార్యుల గురించి ఎంతో గొప్పగా విన్నానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ఎన్నో మంచిపనులు చేశారన్నారు. పత్రికను కూడా నడపడంతో పాటు అనంతపూర్‌కు హైస్కూల్, కాలేజీ రావడానికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ తరానికి ఆయన గురించి తెలిసేలా పుస్తకాన్ని రచించిన రావినూతల శ్రీరాములును ముద్రించిన ఎమెస్కోను ప్రత్యేకంగా అభినందించారు. వేంకటేశ్వరయూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య ఇనాక్, ప్రముఖ పీ.ఎల్.ఎన్ రెడ్డి, ఎమెస్కో పుస్తక సంపాదకులు చంద్రశేఖర్‌రెడ్డి, బీడీఎల్ పూర్వ డీజీఎం, డీవీ రాఘవ, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నేత మృతి



కవాడిగూడ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఐడీయల్ సత్యనారాయణ (79) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం దోమలగూడ ఏవీ కళాశాల సమీపంలోని ఉందాబాగ్‌లో నివాసం ఉండే ఐడియల్ సత్యనారాయణకు ముగ్గురు కుమార్తెలు ఓ కుమారుడు సంతానం. కాగా గత మూడేళ్ల క్రితం భార్య సుశీల మృతి చెందారు. సామాన్య కార్యకర్త నుంచి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేశారు. మంగళవారం మధ్యాహ్నం గుండెపోటు ఇంట్లోనే మృతి చెందారు. ఆయన మృతిపట్ల టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఏ–బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ, మాజీ అధ్యక్షులు కె.ఆర్.కె.ప్రసాద్, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బుధవారం దోమలగూడ హిందూ శ్మశానవాటిలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.